పేదల సంక్షేమమే జగనన్న లక్ష్యం

- చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు
- నగరంలో 230 మంది పేదలకు భూ పంపిణీ



నిరుపేదలకు భూ పంపిణీ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద

చిత్తూరు రూరల్: పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. నగరంలోని అంబేడ్కర్ భవనంలో బుధవారం భూ పంపిణీ పత్రాల అందజేత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా 230 మందికి భూ హక్కు పత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ భూముల్లేని పేదలను ఆదుకునేందుకు ప్రభుత్వం భూ పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం రైతులకు భూ హక్కు కల్పించే బాధ్యతను నెరవేర్చిందన్నారు. ఈ భూములను రైతులు సాగు చేసుకుని జీవన ప్రమాణాలు పెంచుకోవాలని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మేయర్ అముద, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్ రెడ్డి, తహసీల్దార్లు మురళీమోహన్, బాబురాజేంద్ర ప్రసాద్, డీటీలు కిరణ్, ధనంజయ్య, గుడిపాల ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ ప్రతిమారెడ్డి, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న హయాంలోనే సంక్షేమ బావుటా

బంగారుపాళెం: అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ బావుటా ఎగురవేశారని ఎంపీపీ అమరావతి అన్నారు. మండలంలోని శెట్టేరి గ్రామ సచివాలయంలో బుధవారం వైఎస్సార్‌సీపీ నేత మార్కొండ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆమె మాట్లాడుతూ, సీఎం జగన్ పాలన స్వర్ణయుగమన్నారు. రాష్ట్రంలో పేదల జీవన ప్రమాణాలను మెరుగు పరిచిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. జెడ్పీటీసీ సోమశేఖర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను పార్టీలకు, కులాలకు, మతాలకు ప్రాంతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ డైరెక్టర్ పాలాక్షిరెడ్డి, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ దుర్గాప్రసాద్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్ననే గెలిపించుకుందాం

పూతలపట్టు: రాబోయే ఎన్నికలలో మరోసారి సీఎంగా జగనన్ననే గెలిపించుకుందామని మండల సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పోటుకనుమ సచివాలయాల పరిధిలో బుధవారం వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సంక్షేమ పథకాల లబ్ధి బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజారత్నంరెడ్డి, సర్పంచ్ సంఘం అధ్యక్షులు జయచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, జెడ్పీటీసీ దేవిక, సర్పంచ్ బాబు నాయుడు, ఎంపీడీఓ గౌరి, సింగిల్ విండో అధ్యక్షులు దొరస్వామిరెడ్డి, నాయకులు అమర్నాధరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, మండల యువత అధ్యక్షులు నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





బంగారుపాళెం: బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ అమరావతి, నాయకులు, పూతలపట్టు: కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నగరంలోని పాస్టర్లకు నిత్యావసర సరుకుల పంపిణీ



పాస్టర్లకు సరుకులు అందిస్తున్న నిర్వాహకులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం ఇరువారంలోని రవికుమార్ చర్చిలో బుధవారం పాస్టర్లకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని 150 మంది పాస్టర్లకు రూ.5వేలు విలువ చేసే సరుకులు అందజేశారు. కార్యక్రమంలో రవికుమార్, రమేష్, బాల్‌రాజు పాల్గొన్నారు.

నష్టపరిహారం వెంటనే అందజేయాలి

చిత్తూరు కలెక్టరేట్: తుపాను వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందజేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు జగదీశ్వరనాయుడు డిమాండ్ చేశారు. ఆ పార్టీ నాయకులు బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పలు మండలాల్లో తుపాన్ ప్రభావంతో రైతులు నష్టపోయారని చెప్పారు. ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. పంట నష్టం జరిగిన రైతులకు ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ ధర్నాలో మాజీ ఎంపీ దుర్గ, ఆ పార్టీ నాయకులు శ్రీనివాసులు, కొత్తూరు బాబు, చంద్రమోహన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పథకాలపై అవగాహనకే వికసిత్ భారత్



మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగరాజు

ఐరాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి అర్హులైన వారికి అందించడానికి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర దోహదపడుతుందని ఎంపీడీఓ నాగరాజు అన్నారు. మండలంలోని వేదగిరివారిపల్లె, మద్దిపట్లపల్లె గ్రామాల్లో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను శాఖల వారీగా వివరించారు. అనంతరం గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కుసుమకుమారి, పంచాయతీ కార్యదర్శి బేబీ పాల్గొన్నారు.

నేడు వై ఏపీ నీడ్స్ జగన్

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం 6 వరకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. గాయత్రీనగర్, తోటపాళ్యం, కైలాసపురం, గిరింపేట సచివాలయాల పరిధిలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పర్యటించనున్నట్లు అందులో పేర్కొంది.

బంగారుపాళెంలో కర్ణాటక మద్యం పట్టివేత



నిందితుడిని అరెస్ట్ చూపిస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్: బంగారుపాళెం మండలంలో ఎస్ఈబీ అధికారులు దాడులు నిర్వహించారు. మహాసముద్రం వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న లోకనాథన్ (51) అనే వ్యక్తి వద్ద నుంచి 15 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చూపించి రిమాండ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, ట్రైనీ సీఐ శ్రీరాం, ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నియామకం

చిత్తూరు కార్పొరేషన్: బీజేపీ యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా నగరానికి చెందిన మహేష్‌ను జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు నియమించారు. బుధవారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో యువమోర్చా జిల్లా అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి నియామకపత్రాలను అందజేశారు. గతంలో మహేష్ ఏబీవీపీ నాయకుడిగా, యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.


రైల్వే ట్రాక్‌పై వ్యక్తి మృతి



మృతి చెందిన అస్లాం

చిత్తూరు కార్పొరేషన్: నగరానికి చెందిన వ్యక్తి రైల్వే ట్రాక్‌పై పడి మృతి చెందిన సంఘటన బుధవారం వెలుగుచూసింది. రైల్వే ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం, నగరానికి చెందిన అస్లాం (36) మూడోగేటు వద్ద రైల్వే ట్రాక్‌పై పడి మరణించాడు. ఈయన స్థానికంగా పండ్ల దుకాణంలో పనిచేస్తున్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఆడుదాం ఆంధ్రను విజయవంతం చేయాలి



సంజీవరాయునిపల్లెలో ఆటస్థలాన్ని పరిశీలిస్తున్న జాన్‌విక్టర్

పూతలపట్టు: ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి జాన్‌విక్టర్ అన్నారు. మండల సచివాలయాల పరిధిలోని ఆటస్థలాలను ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం పీఈటీలతో మాట్లాడుతూ క్రీడాకారులకు మైదానంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎర్రచెరువుపల్లి, సంజీవరాయునిపల్లి, పూతలపట్టు, యం.బండపల్లి పాఠశాలలోని ఆటస్థలాన్ని పరిశీలించారు. ఈ నెల 15 వతేదీ నుంచి ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో ఆధునిక వైద్య సేవలు



మాట్లాడుతున్న వైద్యాధికారులు

చిత్తూరు రూరల్: కార్పొరేట్ తరహాలో ఆధునిక వైద్య సేవలు అందించేందుకు మరి కొన్ని సేవలను అందుబాటులోకి తెచ్చామని ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్, అపోలో సూపరింటెండెంట్ సుధాకర్‌బాబు అన్నారు. నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం వారు సమావేశమయ్యారు. డయాగ్నోస్టిక్ ఎండోస్కోపీ సేవలు ఆస్పత్రిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కొలునోస్కోపీతో పెద్ద పేగులో కేన్సర్ కారకాలు, కణితులు, మలబద్ధకం, పేగు పరీక్ష తదితరాలు చేస్తామన్నారు. బ్రోంకోస్కోప్ ద్వారా ఊరిపితిత్తుల ఇన్‌ఫెక్షన్, శ్వాసకోశ ఇన్ఫెక్షన్, ఊపిరితిత్తుల్లో చిక్కుకున్న వస్తువులను బయటికి తీసేందుకు ఈ పరికరాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు.

కొనసాగిన జీడీఎస్ ఉద్యోగుల సమ్మె

చిత్తూరు కార్పొరేషన్: తమ డిమాండ్ల సాధన కోసం తపాలా శాఖ ఉద్యోగుల చేపట్టిన సమ్మె బుధవారం కొనసాగింది. చిత్తూరులోని ప్రధాన తపాలా కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో నిరసన వ్యక్తం చేశారు. జీడీఎస్‌లకు సివిల్ సర్వెంట్ హోదా, సర్వీసు ఇంక్రిమెంట్ ఇవ్వాలని, 8 గంటల పనివిధానం, మెడికల్ రీఎంబర్స్‌మెంట్ కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. నాయకులు ప్రసాద్‌రెడ్డి, మోహన్‌రాజా, బీపీఎంలు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం బలోపేతానికి కృషి



నూతన కమిటీతో లక్ష్మీప్రసన్నకుమార్

ఐరాల: జాతీయ బీసీ సంక్షేమ సంఘం బలోపేతానికి నూతనంగా ఎన్నికైన కమిటీలు కృషి చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పీబీ లక్ష్మీప్రసన్నకుమార్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షుడు కోదండ ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆ సంఘం మండల ఎన్నికలు నిర్వహించారు. సమావేశంలో మండల యువజన విభాగం అధ్యక్షుడిగా బాలు, ఉపాధ్యక్షుడిగా అజయ్, ప్రధానకార్యదర్శిగా మహ్మద్‌సమీర్, కార్యదర్శిగా గోవర్ధన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బీసీ రాయలసీమ అధికార ప్రతినిధి బంగారు నారాయణస్వామి, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మురళి, మండల గౌరవ అధ్యక్షుడు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

16, 17 తేదీల్లో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

పుంగనూరు: పట్టణంలోని బీఎంఎస్ క్లబ్‌లో ఈ నెల 16, 17న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు నానబాల సురేష్, తుంగా మంజు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయి క్రీడాకారులు లోకేష్, యశోదకుమార్ స్మారకార్థం ఈ టోర్నీని మిత్ర బృందం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. తొలి నాలుగు స్థానాల్లో విజేతలుగా నిలిచిన జట్లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులుగా రూ.50 వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10 వేల చొప్పున అందజేస్తామన్నారు. క్రీడాకారులకు భోజనం, వసతి ఏర్పాట్లు కల్పిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలోని క్రీడాకారులు తమ జట్ల పేర్లను 8919883221, 8309652231 సెల్ నంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని కోరారు.. ఈ పోటీలను లోకేష్, యశోదకుమార్ వర్ధంతి పురస్కరించుకుని మిత్ర బృందం మహమ్మద్, నవ యుగనాథ్, గంగాధర్ తదితరులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డు స్వీకరణ



ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డు అందుకుంటున్న ఎస్‌వీ సెట్ ప్రిన్సిపల్ మోహన్‌బాబు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఎస్‌వీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ మోహన్‌బాబు ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డును అందుకున్నారు. అనంతపురం జిల్లా జేఎన్‌టీయూలో బుధవారం యూనివర్సిటీ అవార్డుల కార్యక్రమం నిర్వహించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న మోహన్‌బాబు ఉత్తమ సేవలందించినందుకుగాను అవార్డు ప్రదానం చేశారు. అదే కళాశాలలో పనిచేస్తున్న సివిల్ విభాగం హెచ్‌ఓడీ దామోదర్‌రెడ్డి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును స్వీకరించారు. అవార్డు గ్రహీతలను ఆ కళాశాల వీసీ శ్రీనివాస్ అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పూతలపట్టు: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాంభూపాల్ కథనం మేరకు ఈ నెల 7 వతేదీ పాకాల మండలం గుండ్లపల్లెకు చెందిన మాబూషరీఫ్ కుమారుడు బావాజాన్(22) రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. క్షతగాత్రుడిని తిరుపతి స్విమ్స్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య ఉంది. పోస్టు మార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు సేవలందిస్తున్న వైద్యులు

పూతలపట్టు: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం సోషియల్ యూనిట్ ఫార్ కమ్యూనిటీ హెల్త్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ సంస్థ ద్వారా ఉచిత గుండె వైద్యశిబిరాన్ని సంస్థ డైరెక్టర్ పాల్ విజయ్‌కుమార్ నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి మండల ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. దాదాపు 135 మంది శిబిరానికి వచ్చి చికిత్స పొందారు. ఉచితంగా బీ.పీ, షుగర్ వంటివి చేయించుకున్నారు. మరి కొంతమందికి ఉచితంగా మందులు సరఫరా చేశారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. ఎంపీడీఓ గౌరి మాట్లాడుతూ అధిక ఖర్చుతో కూడిన పరీక్షలను ఉచితంగా చేస్తున్న సుచి సంస్థకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అసోసియేట్ డైరెక్టర్ గ్లోరి విజయ్‌కుమార్, ఎంపీడీఓ గౌరి, సుచి సంస్థ ఇన్‌చార్జ్ మణి, వైద్యాధికారులు ప్రియాంక, ప్రవీణా తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యునిగా పూజారి రాఘవేంద్ర



చిత్తూరు కలెక్టరేట్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) జాతీయ కార్యవర్గ సభ్యునిగా పూజారి రాఘవేంద్ర ఎన్నికయ్యారు. ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన జాతీయ మహాసభల్లో ఆయన్ను ఎన్నుకున్నట్లు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు రాజ్ శరణ్ షాహి ప్రకటించారు. ఎన్నికైన రాఘవేంద్ర మాట్లాడుతూ జాతీయ కార్యవర్గంలో అవకాశం లభించడం ఆనందకరమన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు.

సారా కేసులో నిందితుల అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న ఎస్ఈబీ అర్బన్ పోలీసులు

చిత్తూరు అర్బన్: సారా తయారు చేస్తున్న ఇద్దరు నిందితులను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) చిత్తూరు అర్బన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. మండలంలోని రాసనపల్లె అటవీ ప్రాంతంలో సీఐ జోగేంద్ర ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాటుసారా కాస్తున్న రాసనపల్లెకు చెందిన డి.జాన్సన్ (55), ఆర్.సూర్య (21) అనే ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. నిందితుల నుంచి 50 లీటర్ల సారా, 200 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. నిందితులను ఇద్దరినీ అరెస్టు చేసి, న్యాయమూర్తి ఆదేశాలతో రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు. జాన్సన్‌పై ఇప్పటికే పలు కేసులు ఉన్నాయన్నారు. అక్రమ మద్యం, సారా తయారీలో ఎక్కువ కేసులు ఉన్నవారిపై ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) యాక్టులు నమోదు చేయడానికి ఎస్పీకి ప్రతిపాదనలు ఇవ్వనున్నట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు బాబు, రాంప్రసాద్, సిబ్బంది బాబు, శంకర్ నాయక్, జయశంకర్ పాల్గొన్నారు.

ఆటోల్లో చోరీల నివారణకు చర్యలు



మాట్లాడుతున్న సీఐ విశ్వనాథరెడ్డి

చిత్తూరు అర్బన్: ఆటోల్లో ప్రయాణికుల నుంచి చోరీలు జరగకుండా చర్యలు తీసుకోవాలని చిత్తూరు వన్‌టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి సూచించారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఇటీవల ఆటోల్లో ప్రయాణించే వారు వస్తువులను పోగొట్టుకుంటున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దీనిపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యానికి చేర్చే బాధ్యత డ్రైవర్లదేనన్నారు. ప్రయాణికులు దీనిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సదస్సులో ట్రాఫిక్ సీఐ నిత్యబాబు, ఎస్ఐలు మల్లికార్జున, జయప్ప పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం.. ప్రభుత్వ ధ్యేయం





గుడిపాల: వైద్య సేవలందిస్తున్న డాక్టర్ రక్షిత, ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: మారుమూల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని వేదగిరివారిపల్లెలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 80 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. వైద్యాధికారి మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా ఐరన్ మాత్రలు వేసుకోవాలన్నారు. చిన్నారులకు ఆరోగ్య సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తల్లులకు సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, పీహెచ్ఎన్ జీవకళ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మరకాలకుప్పంలో ఫ్యామిలీ ఫిజీషియన్

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంతో ప్రజల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి రక్షిత అన్నారు. మండలంలోని మరకాలకుప్పంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. బీపీ, చక్కెరవ్యాధి గ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇందులో 61 మందికి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఇంటి వద్దనే ఆరోగ్య సేవలను అందించారు. వైద్య సిబ్బంది యమున, శ్రీలత, దేవప్రీత, రాధ పాల్గొన్నారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన

చిత్తూరు అర్బన్: ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్) వినియోగంపై ఓటర్లు అవగాహన కలిగి ఉండాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ రామకృష్ణుడు చెప్పారు. ఎన్నికల కమిషన్, జిల్లా ఎలక్టోరల్ అధికారి ఆదేశాల మేరకు కార్పొరేషన్ పరిధిలోని మురుకంబట్టు, మురగానపల్లి పరిధిలోని 7, 8, 9, 11, 21, 22, 23, 25, 52 పోలింగ్ కేంద్రాల్లోని బుధవారం ఓటర్లకు ఈవీఎం వినియోగంపై అవగాహన కల్పించారు. ఎన్నికల్లో వినియోగించే ఈవీఎంలు ఎలా పని చేస్తాయి? ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలి? వేసిన ఓటు నమోదు అయ్యిందా లేదా తెలుసుకోవడం? వీవీ ప్యాట్ ఉపయోగం? అనే అంశాలపై స్థానిక ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈవీఎం పనితీరును ప్రజలు స్వయంగా తెలుసుకునేలా మాక్ ఓటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో సంబంధిత బీఎల్వోలు, వార్డు కార్యదర్శులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన

గుడిపాల: ఈవీఎంల వినియోగంపై ఓటర్లు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ బాబూ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. చీలాపల్లె పంచాయతీలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం చీలాపల్లె పోలింగ్ బూత్‌లో ఓటర్లకు ఈవీఎంల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈవీఎంలు ఎలా పనిచేస్తాయి, ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలి, వేసిన ఓటు నమోదు అయ్యిందా లేదా అన్న విషయాలను ఓటర్లకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్, బీఎల్ఓ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు పక్కాగా నిర్వహించాలి

యాదమరి: మండల పరిధిలో అధికారులు ఓటరు నమోదు కార్యక్రమం పక్కాగా నిర్వహించాలని చిత్తూరు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు కోరారు. బుధవారం సాయంత్రం యాదమరి తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి రెవెన్యూ, పంచాయతీ, తదితర శాఖల అధికారులకు, బీఎల్ఓలకు సమావేశం నిర్వహించారు. త్వరలో జరగనున్న శాసనసభ ఎన్నికలకు ఓటరులిస్టు పక్కాగా నిర్వహించాలన్నారు. ఓటరు నమోదు, తీసేయాలన్న వివరాలు పక్కగా ఉండాలన్నారు. ఓటరు నమోదులో ఎలాంటి తప్పులు దొర్లినా అధికారులపై తగు చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హనుమంతు, ఎంపీడీఓ శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.



చిత్తూరు: మురకంబట్టులో అవగాహన కల్పిస్తున్న ఏసీపీ రామకృష్ణుడు



గుడిపాల: ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కార్యదర్శులు బాధ్యతగా వ్యవహరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: మండలంలోని పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా వ్యవహరించాలని ఎంపీడీఓ గౌరి తెలిపారు. ఆమె బుధవారం మండలంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి గ్రేడ్1, 2 పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. పంచాయతీ కార్యదర్శులు సమస్యలు పరిష్కరించే విధానాన్ని తెలుసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు అధికారాన్ని ఎక్కడబడితే అక్కడ చలాయించకూడదని సూచించారు. పంచాయతీలను అభివృద్ధి బాటలో తీసుకొచ్చే బాధ్యత కార్యదర్శులదేనని తెలిపారు. అనంతరం గ్రామ పంచాయతీ పరిపాలన విధానం, గ్రామ సభలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, ఐరాల ఈఓపీఆర్డీ కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.